క్లుప్తంగా

ప్రభుత్వ స్కూళ్లలో చేర్చాలంటూ ర్యాలీ



అవగాహన ర్యాలీలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ శుక్రవారం ఆ గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 'నాడు-నేడు' పథకంతో పాఠశాలల రూపురేఖలను జగన్ ప్రభుత్వం మార్చివేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

చాగల్లు: మండలంలోని నెలటూరుకు చెందిన పేద కుటుంబానికి మదర్ థెరిసా సేవా సమితి ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన నిత్యావసర సరుకులు శుక్రవారం అందజేసినట్టు నిర్వాహకుడు శ్రీనివాస్ తెలిపారు.

సుందరయ్య ఆశయాలు ఆదర్శనీయం


చాగల్లు: స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేని వని, ఆయన ఆశయాలు ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు అన్నారు. మండలంలోని ఊనగట్లలోని పౌరసరఫరాల గోదాము వద్ద పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. సుందరయ్య చిత్ర పటానికి రాంబాబు, హమాలీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దిడ్ల సత్యనారాయణ, ఎస్.శ్రీను, సత్తిపండు, శ్యామ్, వెంకటేష్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ రామమోహన్‌రెడ్డి

గోపాలపురం: రెండు రోజుల పాటు నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం స్థానిక పెద్దగూడెంలో గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి ప్రారంభించారు. యువత రాత్రివేళ కూడా వాలీబాల్ ఆడుకొనేలా రామమోహన్‌రెడ్డి రూ.30 వేల ఆర్థిక సహాయంతో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర క్రీడల కార్పొరేషన్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దాతలు దాసరి రాజేష్, కప్పల వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వార సంగీత, వింజమూరి సుబ్బారావు, కోనాల కిరణ్‌కుమార్, బేతాళ శ్రీనివాసరావు తదితరులు ఈ పోటీలకు ఆర్థిక సహాయం అందజేశారు.

ఫ్లెక్సీ తొలగింపుపై తహసీల్దార్ ఫిర్యాదు


శ్మశానవాటిక వద్ద ఆక్రమణదారు చించేసిన ఫ్లెక్సీ

గోపాలపురం: దొండపూడి పంచాయతీ పరిధిలోని సాగిపాడులో ఆక్రమణకు గురైన శ్మశానవాటిక స్థలాన్ని హైకోర్టు ఉత్తర్వుల మేరకు రెవెన్యూ అధికారులు గురువారం సర్వే చేసి, ఆ పంచాయతీకి అప్పగించారు. ఈ స్థలంలో రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆక్రమణదారుడు పేరూరి ప్రసాద్ శుక్రవారం తొలగించాడు. దీంతో అతడిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.వీంద్రనాథ్ గోపాలపురం పోలీసులకు సూచించారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన స్థలాన్ని ఉపాధి కూలీలు శుభ్రం చేస్తుండగా ఆక్రమణదారుడు పేరూరి ప్రసాద్ వారిపై దుర్భాషలు ఆడినట్టు దొండపూడి పంచాయతీ సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు అతడిపై గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దేవరపల్లి: జాతీయ రహదారిపై దేవరపల్లి-గోపాలపురం మధ్య గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేటకు చెందిన దంపల లక్ష్మీనారాయణ (చిన్ని- వయసు-35) అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్నాడు. గుర్తు తెలియని వాహనం అతడిని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు శుక్రవారం రాత్రి తెలిపారు.

సీఎం బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

- తొలిసారిగా 24న కొవ్వూరు వస్తున్న జగన్
- అధినేత పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మంత్రి వనిత
- ఏర్పాట్ల బాధ్యతలు నాయకులకు అప్పగింత
- పట్టణంలో బస్టాండ్ మీదుగా రోడ్ షో
- నేడు చాగల్లు మండలం, కొవ్వూరు పట్టణ నేతలతో సమీక్ష


ముఖ్యమంత్రి బహిరంగ సభా ప్రాంగణం వద్ద పనులు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు కొవ్వూరులో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్రస్థాయి జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఈ నెల 24న కొవ్వూరులో నిర్వహించనున్న విషయం తెలిసిందే. తొలుత నిర్ణయించిన ప్రకారం సత్యవతి నగర్‌లో మంత్రి క్యాంపు కార్యాల యం సమీప ప్రాంగణంలోనే బహిరంగ సభను నిర్వహిస్తారు. ఈ క్రమంలో సభా ప్రాంగణంలో లెవెలింగ్ పనులు శుక్రవారం ముమ్మరంగా కొనసాగాయి. మరో వైపు సభ వేదిక పనులు కూడా ప్రారంభమయ్యాయి. రాత్రింబవళ్లు పనులు కొనసాగేలా జనరేటర్లు ఏర్పాటు చేశారు. బహిరంగ సభా వేదిక వద్ద భారీ ఎత్తున పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. బైపాస్ రోడ్డులోని బుద్ధుడు జంక్షన్ వద్ద ఇప్పటికే ముఖ్యమంత్రి హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. వేర్వేరు కారణాల వల్ల ముఖ్యమంత్రి కొవ్వూరు పర్యటన రెండు సార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి సీఎం పర్యటనను ఎలాగైనా విజయవంతం చేయాలనే లక్ష్యంతో హోం మంత్రి తానేటి వనిత పట్టుదలతో ఉన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి కొవ్వూరులో భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. హెలిప్యాడ్ నుంచి బస్టాండ్ జంక్షన్ మీదుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ముఖ్యమంత్రి రోడ్ షో నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అడ్డంగా ఉన్న విద్యుత్ వైర్లను, చెట్ల కొమ్మలను తొలగించారు.

మండలాల వారీగా సమీక్ష

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం మండలాల వారీగా వైఎస్సార్ సీపీ నాయకులతో సమీక్ష జరిపారు. జన సమీకరణ, స్వాగతం, ఇతర ఏర్పాట్లపై వారితో మాట్లాడారు. కొవ్వూరు, తాళ్లపూడి మండలాల నాయకులతో గ్రామాల వారీగా మంత్రి అంతర్గతంగా చర్చించారు. తొలిసారిగా ముఖ్యమంత్రి కొవ్వూరు పర్యటనకు వస్తున్నందున రోడ్‌షో, సభా ప్రాంగణం వద్ద నాయకులు తీసుకోవాల్సిన బాధ్యతలు, జన సమీకరణకు వాహనాల సేకరణపై చర్చించారు. సభకు వచ్చే పార్టీ శ్రేణులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం తాగునీరు, అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎక్కడా లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులకు మంత్రి సూచించారు. హెలిప్యాడ్ నుంచి రోడ్ షో ద్వారా ముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి చేరుకోనున్నందున దారి పొడవునా చేయాల్సిన ఏర్పాట్లపై నాయకులతో మంత్రి చర్చించారు. శనివారం కొవ్వూరు పట్టణం, చాగల్లు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష జరుపుతారు.ఇప్పటికే కొందరు నాయకులకు పలు రకాల బాధ్యతలను ఆమె అప్పగించారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం


కొవ్వూరు నియోజకవర్గానికి తొలిసారిగా విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. ఏర్పాట్లపై ఇప్పటికే నియోజకవర్గ నాయకులతో గ్రామాల వారీగా సమీక్షించాం. పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశాం. ముఖ్యమంత్రి రోడ్‌షో, బహిరంగ సభ నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగించాం.

–తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

వెలకట్టలేనివి వలంటీర్ల సేవలు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- 62 మందికి పురస్కారాల ప్రదానం


గ్రామ వలంటీర్లను సన్మానించి పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గ్రామ వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వలంటీర్లు సేవాభావంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 1248 మంది వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్నట్టు ప్రకటించారు. వారిలో 20 మందికి సేవా రత్నం, ఐదుగురికి సేవా వజ్రం, మిగిలిన వారికి సేవామిత్ర అందజేస్తున్నట్టు వివరించారు. సేవా వజ్రకు రూ.30 వేలు, వజ్రకు రూ.20 వేలు, మిత్రకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం నగదు పురస్కారాలతో పాటు మెడల్, ప్రశంసాపత్రం అందించి సత్కరిస్తున్నట్టు చెప్పారు. మండలాలవారీగా దేవరపల్లిలో 293, గోపాలపురంలో 237, నల్లజర్లలో 336, ద్వారకాతిరుమలలో 382 మంది వలంటీర్లు పురస్కారాలు అందుకుంటున్నట్టు వివరించారు. వారికి ప్రభుత్వం రూ.1.30 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో 62 మంది వలంటీర్లను ఎమ్మెల్యే తలారి సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి రాజు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు కామిశెట్టి శిరోమణి , పల్లికొండ రామలక్ష్మి, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దళితులంటే చంద్రబాబుకు చులకన


అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే తలారి, వైఎస్సార్ సీపీ నాయకుల నిరసన

దేవరపల్లి: దళితులంటే చంద్రబాబుకు చులకన భావమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. అమరావతిలో సుమారు 50 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధులుగా వ్యాఖ్యానించడాన్ని ఎమ్మెల్యే తలారి తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా దేవరపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. నల్లరిబ్బన్లు ధరించి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి నిరసన తెలిపారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన సెగ


నిడదవోలు ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, గృహ లబ్ధిదారులు

నిడదవోలు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా కేటాయిస్తున్న స్థలాలను సమాధులతో పోలుస్తూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు, లబ్ధిదారులు భగ్గుమన్నారు. ఆ వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణ రాస్తారోకో చేశారు. పేదల స్థలాలను సమాధులతో పోల్చిన చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో రాజకీయ సమాధి చేయాలంటూ నినదించారు. పేదలకు క్షమాపణ చెప్పాలంటూ చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోటి మందికి అవాసాలు కల్పిస్తుంటే చంద్రబాబుకు కడుపు మంటతో పేదల ఇళ్లను సమాధులు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు ఎస్కే వజీరుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు గంగుల వెంకటలక్ష్మి యలగాడ బాలరాజులు తమ ప్రసంగాల్లో చంద్రబాబు వ్యాఖ్యలను తప్పుబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మరింత మెరుగైన సేవలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు
- కానూరు పీహెచ్‌సీ సందర్శన


కానూరు పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి టి.వేంకటేశ్వరరావు సూచించారు. కానూరు పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా రోగుల వద్దకే వైద్యులే వెళ్లాలనేది ఫ్యామిలీ డాక్టర్ ఉద్దేశమని, అందుకు తగ్గట్టుగా మన సేవలు ఉండాలన్నారు. గతం కంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇప్పుడు అనేక రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసినందున ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య మరింత పెరగాలన్నారు. సిబ్బంది కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని, వైద్య సేవలను మాత్రం రోగులకు పూర్తి స్థాయిలో అందించాలని సూచించారు. కానూరు పీహెచ్‌సీ సిబ్బంది పని తీరు, రికార్డుల నిర్వహణపై డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు సంతృప్తి వ్యక్తం చేశారు. ఓపీ సంఖ్య మరింత పెరిగేలా చర్యలు చేట్టాలన్నారు. వైద్యులు పి. తేజశ్రీ , కె. హేమరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త క్వార్టర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీలో శిథిలమైన పాత క్వార్టర్స్‌ను తొలగించి, ఆ స్థానంలో కొత్తగా క్వార్టర్స్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు రాజనాల ప్రసాద్ నుంచి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీలోని అన్ని గదులనూ పరిశీలించి తగు సూచనలు చేశారు. రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పర్యావరణ హిత జీవన శైలి మేలు

నల్లజర్ల: పర్యావరణ హిత జీవనశైలి మానవాళికి ఎంతగానో మేలు చేస్తుందని అటవీ శాఖ నల్లజర్ల డీఆర్వో చెల్లా శ్రీనివాసరావు అన్నారు. పర్యావరణ హిత జీవనశైలి పేరిట చేపట్టిన లైఫ్ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని అనుమునిలంక గ్రామ సచివాలయం వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు గ్రామస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. శక్తి వనరులను, నీటిని పొదుపుగా ఏ విధంగా వాడుకోవాలో వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నా దిన చర్యలో సాధ్యమైనన్ని మార్పులు చేసుకుంటానంటూ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పిచ్చుకుల గణపతి, దారం శ్రీనివాసరావు, కార్యదర్శి జొన్నకూటి గణేష్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు, బీట్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

రిబేట్‌ను రుణంగా పరిగణించవద్దు

దేవరపల్లి: సొసైటీల ద్వారా రైతులకు అందించిన ఆరు శాతం రిబేట్‌ను రుణంగా పరిగణించడం వల్ల ఇబ్బంది పడుతున్నామని సొసైటీల చైర్మన్లు వాపోయారు. దీనిపై మండలంలోని ఏడు సొసైటీల చైర్మన్లు శుక్రవారం యర్నగూడెంలోని కేంద్ర సహకార బ్యాంకు మేనేజరు భాస్కరకుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కురుకూరు, చిన్నాయగూడెం సొసైటీల చైర్మన్లు కూచిపూడి వీరవెంకట సతీష్, గడా జగదీష్ మాట్లాడుతూ 2010-2011 సంవత్సరానికి ఆరు శాతం రిబేట్‌ను జిల్లా సహకార బ్యాంకు సొసైటీల పేరున రుణంగా మార్చినందున సొసైటీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. రిబేట్‌ను రుణంగా మార్చడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించకపోతే న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. మండలంలోని ఏడు సంఘాల్లో రూ.85 లక్షల రిబేట్‌ను రుణంగా చూపించినట్టు వారు తెలిపారు. దేవరపల్లి, దుద్దుకూరు, గౌరీపట్నం, సొసైటీల చైర్మన్లు కవల శ్రీనివాస్, కాండ్రు రామకృష్ణ, గుత్తికొండ అచ్యుతరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తనఖాదారులూ! ఆందోళన చెందవద్దు

కొవ్వూరు: తన వద్ద బంగారు ఆభరణాలు తనఖా పెట్టిన వారెవరూ ఆందోళన చెందనవసరం లేదని పట్టణంలోని రాజేంద్ర పాన్ బ్రోకర్స్ అధినేత శాంతిలాల్ జైన్ స్పష్టం చేశారు. తమ దుకాణంలో కొద్ది రోజుల క్రితం జగిన బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారని శుక్రవారం ఆయన విలేకరులకు చెప్పారు. రికవరీ చేసిన బంగారు అభరణాలను ఇప్పటికే పోలీసులు పోలీసులు కోర్టుకి అప్పగించారన్నారు. చట్ట ప్రకారం కోర్టు నుంచి ఆభరణాలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఖాతాదారులు ఎవరు ఆందోళన చెందనవసరం లేదన్నారు. నగలు కుదువ పెట్టిన ప్రతి ఖాతాదారుడూ తమ బకాయి సొమ్ము చెల్లించి ఆభరణాలు తీసుకోవచ్చని సూచించారు. కేసు కోర్టులో ఉన్నందున్న లావాదేవీలకు కొంత మేరకు జాప్యం అవుతుందన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

గోపాలపురం: చోరీ కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు స్థానిక ఎస్‌ఐ కె.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. గత నెల 30న గోపాలపురానికి చెందిన వేసంగి సాయిచందు ఇంట్లో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, మరో ఇంట్లో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ చోరీకి గురయ్యాయి. ఈ కేసులో గోపాలపురానికే చెందిన భూరెడ్డి వీరవెంకట నాగ నవీన్‌ను రిమాండ్‌కు పంపామన్నారు.


వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉండ్రాజవరం: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి ఆసక్తి కలిగిన అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. మండలంలో దమ్మెన్ను(ఎస్సీ) -1, కె.సావరం (బీసీ)-2, కాల్దారి (ఎస్సీ)-2, వేలివెన్ను (ఓసీ)-1 మొత్తం ఆరు వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి 25న నియామక పత్రాలు అందజేస్తామన్నారు. 26 నుంచి శిక్షణ ఇస్తామని తెలిపారు.

కొవ్వూరు మండలంలో..

కొవ్వూరు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్‌ల పోస్టుల భర్తీకి ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్ తెలిపారు. పెనకనమెట్టలో ఒకటి (జనరల్), కుమారదేవంలో రెండు (ఒకటి జనరల్ మహిళ, మరొకటి బీసీ మహిళ) పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులకు ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారికి 25న నియమక పత్రాలు అందజేస్తామన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే తలారి


కాలిపోయిన పశువుల శాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: అగ్ని ప్రమాదం వల్ల తీవ్రంగా నష్టపోయిన వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శుక్రవారం పరామర్శించారు. మండలంలోని పడమరచోడవరం శివార్లలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో మద్దిపాటి శ్రీనివాస్‌కు చెందిన 4 పాడి గేదెలు, ఆవు, దూడ,ఒక మేకతో పాటు వ్యవసాయ యంత్ర సామగ్రి, ధాన్యం బస్తాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకట్రావు శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి బాధితుడు శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.13.50 లక్షల నష్టం వాటిల్లినట్టు రైతు వివరించారు. ఎమ్మెల్యే తలారి అక్కడి నుంచే కలెక్టరు మాధవీలతకు ఫోన్‌లో ప్రమాద ఘటన గురించి వివరించి ప్రభుత్వ పరంగా రైతును ఆదుకోవాలని కోరారు. కలెక్టరు ఆదేశాలతో పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ సత్యగోవింద్, కొవ్వూరు డీడీ డాక్టర్ జి.రాధాకృష్ణ, నల్లజర్ల ఏడీఏ జాన్‌వెస్లీలు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించి నివేదిక రూపొందించారు.దీనిని కలెక్టరు నివేదిస్తామని వారు వెల్లడించారు.

దోమల నివారణ సామాజిక బాధ్యత

ఉండ్రాజవరం: దోమల నివారణను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని తణుకు సెక్టార్ మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వడ్లూరు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో దోమ కాటు వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం గృహాల్లో డ్రై డేగా పాటించడం వల్ల దోమల వ్యాప్తిని పూర్తిగా అరికట్టవచ్చన్నారు. మురుగు పారుదలకు ఆటంకం కలగకుండా డ్రైన్‌లలో వ్యర్థాలు వేయకుండా పరిశుభ్రత పాటించడం ద్వారా మాత్రమే దోమల పుట్టుక నిలుపుదల సాధ్యమన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాసు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పందేలు ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

చాగల్లు: మండలంలోని ఊనగట్ల గ్రామ శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ.21,430 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.